



వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన క్రీడల శాఖ, శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి మాదక ద్రవ్యాల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలను కనిపెడుతుండాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. యువత ఆరోగ్యంగా ఉండాలని, చదువుతోపాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా యువజన క్రీడల అధికారి మహమ్మద్ సత్తార్, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి పాల్గొన్నారు.



ర్యాలీలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఈవో విజయకుమారి

యువత మత్తుకు బానిస కావొద్దు

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా కోరారు. గురువారం తూంకుంటలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల పీడీ, సీడీపీఓ శారద ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. తూంకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి అదనపు కలెక్టర్, డబ్ల్యూసీడీఎస్‌సీ పీడీ, డీఈఓ విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, హెచ్‌ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయులు డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

అంగన్‌వాడీలకు మహర్దశ!

కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు

అద్దె, తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. జిల్లాలో కొత్తగా 51 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అద్దె భవనాల్లో చాలీచాలని గదుల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి. జిల్లాలో సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో లబ్ధిదారులకు కనీస సదుపాయాలు లేక అవస్థలు తప్పడం లేదు. పౌష్టికాహారం పంపిణీకి, రికార్డులు, రిజిష్టర్లు భద్రపరిచేందుకు సైతం ఇబ్బందులు పడుతున్న దుస్థితి.

- జిల్లాలో 51 చోట్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్
- రూ.6.12 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- నెలాఖరు వరకు స్థల సేకరణ ప్రక్రియ పూర్తి
- ఆ వెంటనే నిర్మాణ పనులకు శంకుస్థాపనలు
- జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు


బంట్వారం మండలం, రొంపల్లిలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం


యాలాల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-3

వికారాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అద్దె, తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు లేక గర్భిణులు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నారులు ఆడుకునే వసతి లేక వారికి ఆహ్లాదం కరువవుతోంది. అంగన్‌వాడీ సేవలను పటిష్ఠంగా మరింత విస్తరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సమస్య తీవ్రంగా ఉన్న కేంద్రాలకు ముందుగా సొంత భవనాలు నిర్మించడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ విషయంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంఖ్యను కూడా

మిగతా 8వ పేజీలో...

స్థలాల గుర్తింపు షురూ..

ఇదిలా ఉంటే, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల కోసం ఇది వరకే స్థల సేకరణ చేసిన చోట్ల మరోసారి పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. స్థలాలు గుర్తించని ప్రాంతాల్లో ఈనెలాఖరు వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్న ఆదేశాలు ఉన్నాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాగానే అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. భవనాల నిర్మాణం కోసం ఇంత వరకు స్థలాలు గుర్తించని గ్రామాలు, వార్డుల్లో ఐసీడీఎస్ అధికారులు స్థల సేకరణ ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

జిల్లా వివరాలు

అంగన్ వాడీలు	ఐసీడీఎస్ ప్రాజెక్టులు	సొంత భవనాలు	అద్దె భవనాలు	తాత్కాలిక భవనాలు	చిన్నారులు	గర్భిణులు	బాలింతలు
1,129	05	497	195	437	56,766	6,313	5,683

సమాచారం

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలు

మేడ్చల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గిరిజన బాల బాలికలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు గానూ ప్రభుత్వం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు 35 సీట్లు మంజూరు చేసినట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఇన్‌చార్జి అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. ఇందులో 3వ తరగతిలో 17 సీట్లు, 5వ తరగతిలో తొమ్మిది, 8వ తరగతిలో తొమ్మిది సీట్లు మంజూరు చేసినట్లు వివరించారు. జిల్లాలోని గిరిజన తెగలకు చెందిన లంబాడా, ఎరుకుల ఇతర ఉప కులాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 27 సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేయాలన్నారు. వివరాలకు 9959159629లో సంప్రదించాలని కోరారు.

వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని అర్బన్ పీహెచ్‌సీలో వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి తెలిపారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 13 పోస్టులు, కూకట్‌పల్లిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్‌సెంటర్‌లో 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ పోస్టులకు మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎంబీబీఎస్ డాక్టర్లతో భర్తీ చేయనున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా అధికారి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 27లోపు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వీకరిస్తారన్నారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారం, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు రూ.500 విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పేరిట తీసుకుని, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయం, ఫస్ట్ ఫ్లోర్, ఎఫ్-1, ఐడీసీ, అంతాయపల్లి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో దాఖలు చేసుకోవాలన్నారు.

రూ.10 కోట్లతో ఎకో టూరిజం అభివృద్ధి

» కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి


చెరువు కట్ట దగ్గర స్థలాలను పరిశీలిస్తున్న కడా ప్రత్యేకాధికారి, డీఎఫ్‌వో

బొంరాస్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఇరిగేషన్ శాఖ డీఈ కిరణ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తదితరులు మండల కేంద్రం బొంరాస్‌పేట్ సమీప అటవీ ప్రాంతంలోని సంగమేశ్వర ఆలయ పరిసరాలు, బొంరాస్‌పేట్ పెద్ద చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కడా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఆలయం చుట్టూ ఎకో టూరిజం పార్కుల ఏర్పాటు, ఆలయం నుంచి బొంరాస్‌పేట్ చెరువు కట్ట వరకు స్కైవే, వాచింగ్ టవర్‌తోపాటు చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అటవీ శాఖ అధికారులు, బోటింగ్ ఏర్పాటు చేసే సంస్థ, ఇరిగేషన్ శాఖ సంయుక్తంగా పనుల కోసం నివేదికలు అందించాలన్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి సవిత, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, కృష్ణ, బాల్‌రాజ్‌గౌడ్, ఆశప్ప, భీమయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.


వన మహోత్సవానికి
సర్వం సిద్ధం
బషీరాబాద్ మండలంలోని నర్సరీల్లో 3.16 లక్షల మొక్కల పెంపకం
8

రోగాల కాలం
జాగ్రత్తలు అవసరం
గొర్రెలకు మూతి రోగం రాకుండా అప్రమత్తత తప్పనిసరి
7

అడ్మిషన్లు, ఫలితాల్లో తాండూరు టాప్

» ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారికి సన్మానం


శంకర్ నాయక్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా

తాండూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు, రికార్డు స్థాయిలో అడ్మిషన్లు సాధించినందున ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్‌ను ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా సన్మానించారు. గురువారం రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 400 కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఉత్తీర్ణత, అడ్మిషన్లలో తాండూరు జూనియర్ కళాశాలల టాప్‌లో నిలిచింది. అన్ని కాలేజీల కంటే తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 550 అడ్మిషన్లు జరిగాయి. ఇంటర్ ఫలితాల్లో 83 శాతం ఉత్తీర్ణత సాధించింది. దీంతో జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్‌ను ప్రిన్సిపల్ సెక్రటరీ అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మల్లినాథప్ప, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యావరణంపై క్విజ్ పోటీలు

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రేణుకాదేవి

వికారాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో ఎన్‌ఎస్‌పీసీ 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'హరిత్ జీవన విధానం' అనే థీమ్‌పై జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు నిర్వహించే ఎన్‌ఎస్‌పీసీ పోటీలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పాల్గొనేవారు ఎకోమిత్రమ్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని, క్విజ్ హిందీ, ఇంగ్లిష్ తదితర భాషల్లో ఉంటుందన్నారు. పోటీలో పాల్గొనేవారు మొక్క నాటి నీరు పోసి సంరక్షించిన, లేదా వ్యర్థాలను వేరు చేసిన సెల్ఫీ ఫొటోను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఒకటో తరగతి నుంచి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాల్లో పోటీ జరుగుతుందన్నారు.


నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్

తాండూరులోనే కొడంగల్ మెడికల్ కళాశాల

రాష్ట్ర వైద్యా విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

తాండూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాలను తాత్కాలికంగా తాండూరులో కొనసాగించాలా, లేదా అనే అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం తాండూరులో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాలతోపాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. తాత్కాలికంగా తాండూరు నర్సింగ్ కళాశాలలోనే మెడికల్ కళాశాలను కొనసాగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సౌకర్యాలు, మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంజూరైన మెడికల్ కళాశాలను వైద్య బృందం పరిశీలిస్తుందని పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులపై ఆరాతీశారు. భవన నిర్మాణం బాగుందని, ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వాన్ని నివేదిక ఇస్తామని తెలిపారు. 50 మంది విద్యార్థులతో ఈ ఏడాది మెడికల్ కళాశాలను ప్రారంభించే అవకాశం ఉందని చెప్పారు. ఆయన వెంట జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీపీసీసీ అబ్జర్వర్ నరేందర్

కార్యకర్తలను గుర్తించి పదవులిస్తాం

» టీపీసీసీ అబ్జర్వర్ నరేందర్

వికారాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి వారికి తగ్గ పదవులు ఇస్తామని టీపీసీసీ అబ్జర్వర్ నరేందర్ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని స్పీకర్ ప్రసాద్‌కుమార్ నివాసంలో పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల కష్ట ఫలితంగా వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేశామని, గడ్డం ప్రసాద్‌కుమార్ గెలిచి స్పీకర్‌గా ఎన్నికయ్యారని, ఇది కార్యకర్తల కృషితోనే సాధ్యమైందన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వ ఆశయమని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ పరిధిలోని శివ శివాని కాలనీ, సింగాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎల్లంకి భారతి, పారనంది బాల్‌రాజ్, మహ్మద్ జాఫర్, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మున్సిపల్ డీఈఈ సునీత, హౌసింగ్ పీడీ రమణమూర్తి, ఏఈ కమలాకర్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

» జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి


ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న మోహన్‌రెడ్డి

బంట్వారం జూన్ 26(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మద్వాపూర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆధార్ తరహాలో ప్రతి రైతుకూ 11 నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య (యూనికోడ్)ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. రైతు భూ వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీని ఏర్పాటు చేస్తారని, రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని రైతులకు ఫార్మర్ ఐడీ కేటాయిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర పథకాలైన రైతు భరోసా, రుణమాఫీకి ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధం లేదన్నారు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడీ) పొందేందుకు ఆధార్, పాస్ బుక్, ఆధార్‌కు లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌తో ఏఈఓ, ఏఈవోను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. అనంతరం మండలం కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి శ్రవ్య, ఏఈవోలు ఉన్నారు.

రూ.65లక్షలతో దుకాణ సముదాయ నిర్మాణం

● నేడు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డిలతో ప్రారంభోత్సవం


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదుట రూ.65లక్షలతో నిర్మించిన దుకాణ సముదాయం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. మార్కెట్ యార్డుకు ఆదాయాన్ని చేకూర్చేలా నిర్మించిన 8 దుకాణాలను శుక్రవారం ప్రారంభించేందుకు మార్కెట్ పాలకవర్గం, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను గురువారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ దుకాణ సముదాయ ప్రారంభోత్సవానికి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. మార్కెట్ యార్డు పరిధి ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యాచారం ఎంపీడీవోగా రాధారాణి బాధ్యతల స్వీకరణ

యాచారం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యాచారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రాధారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె హైదరాబాద్ జీహెచ్ఎంసీ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో జి.నరేందర్ రెడ్డి సెర్ప్ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. రాధారాణి మాట్లాడుతూ.. విరివిగా మొక్కలునాటి సంరక్షణకు యువత చొరవ తీసుకోవాలన్నారు.

అడుగడుగునా మురుగు..

స్వచ్ఛత కనుమరుగు

హిమాయత్‌నగర్ రోడ్లపై పొంగుతున్న డ్రెయిన్లు | పరిష్కారం చూపాలంటున్న స్థానికులు




హిమాయత్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై, కాలనీల్లో పారుతున్న మురుగు

మొయినాబాద్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉప్పొంగుతున్న మురుగుతో మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి హిమాయత్‌నగర్‌లో పారిశుధ్యం లోపించింది. ఇక్కడ స్వచ్ఛత మచ్చుకైనా కన్పించని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ పారుతున్న డ్రైనేజీ నీటితో కాలనీలు, మెయిన్ రోడ్డు వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వానాకాలం.. ఈ సమయంలో మురుగు నీటిప్రవాహంతో రోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చిలుకూరుకు రోడ్డులో మురుగు నిత్యం ప్రవహిస్తోంది. కల్వర్టు మూసుకుపోయి మ్యాన్ హోళ్ల నుంచి మురుగు నీరు చిమ్ముతోంది. కల్వర్టు కింది నుంచి బూరుకుంట చెరువులోకి నీరు వెళ్లే నాలా కబ్జాకు గురైంది. అధికారులు నామమాత్రంగా యూడీలో పూడిక తీస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. తమ గ్రామం కొత్తగా ఏర్పాటైన మొయినాబాద్ మునిపాలిటీలో కలవడంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు సంతోషించినా అధికారుల అలసత్వంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ఇటువైపు కన్నెత్తయినా చూడడం లేదంటున్నారు.

ఏళ్ల నుంచే సమస్య...

హిమాయత్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై ఏళ్ల నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. వైన్స్ వద్ద ఉన్న కల్వర్టును ఆక్రమించారు. కుమ్మరిబస్తీ, సాయిబాబా ఆలయం కాలనీల మురుగునీరు కల్వర్టు కింది నుంచి నాలా ద్వారా బూరుకుంట చెరువులోకి వెళ్లేది. అది కబ్జా కావడంతో మురుగు నీరు పారలేక డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. కుమ్మరిబస్తీ, సాయిబాబా, హనుమాన్ ఆలయాల వద్ద, చిలుకూరు రోడ్డులో మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయి. మున్సిపల్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు సంబంధం లేనట్టు వదిలేస్తున్నారు. వానపడిన సమయంలో రోడ్డంతా మురుగు నీటితో దుర్గంధభరితంగా మారుతోంది. ఏళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు పరిష్కరించడం లేదు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అయినా తగిన చర్యలుతీసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య తీవ్రతను అధికారులు
పట్టించుకోవడం లేదు



అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ఏళ్ల నుంచి హిమాయత్‌నగర్ ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి. మురుగు నీరు రోడ్డుపైకి పారిన సమయంలో తాత్కాలికంగా మ్యాన్ హోళ్లలో పూడిక తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కల్వర్టు కింద గతంలో ఉన్న నాలాను కబ్జా చేయడంతో మురుగు నీరు వెనక్కు తన్నుతోంది. యూజీడీని బూరుకుంట చెరువు వరకు నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతోంది.

\- కుమ్మరి శ్రీనివాస్, హిమాయత్‌నగర్

అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలి


దేవరయంజాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట,జూన్ 26(ఆంధ్రజ్యోతి): సొంత భవనాలు లేక ఇక్కట్లకు గురవుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు యుద్ధ ప్రాతిపాదికన భవనాలను నిర్మింపజేసి సమస్యలు తీర్చాలని అవసరమైన వసతులను బాధ్యతగా కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తూంకుంట మునిసిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె తూంకుంట ఉన్నత పాఠశాలను, దేవరయంజాల్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. దేవరయంజాల్‌లో అంగన్‌వాడీలు తాత్కాలిక భవనాల్లో నడుపుతున్నామని, పిల్లలు అవస్థలకు గురవుతున్నారని సీడీపీవో శారద అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఆమె అంగన్‌వాడీ సమస్యలపై సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమనిలతోచర్చించారు. దేవరయంజాల్‌లో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు మున్సిపల్ నిధులతో భవనాలను నిర్మింపజేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌ను ఆదేశించారు. అంగన్‌వాడీ చిన్నారులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. గర్భిణులకు గుడ్లు, పాలు నిత్యం ఇస్తున్నారా? అని అంగన్‌వాడీ టీచర్లను అడిగారు. దేవరయంజాల్‌లోని ప్రాథమిక పాఠశాలకువెళ్లి యూనిఫామ్‌లు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారా? అని విద్యార్థులను అడిగారు. అదనపు కలెక్టర్ వెంట డీఈవో విజయకుమారి, మున్సిపల్ డీఈఈ సునీత ఉన్నారు.

అత్యున్నత శిఖరాలకు ఎదగాలి

తూంకుంట జెడ్పీ పాఠశాలను రాధికాగుప్తా సందర్శించి పనితీరును పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధించారు. పాఠ్యాంశంలోని విషయాలను బోర్డుపై రాసి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను నిత్యం చదవి అత్యున్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు ఆమె సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న యాదగిరి

కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ప్రతీ గ్రామంలో జెండా గద్దెల నిర్మాణాలు చేపట్టాలని సంఘం రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఎం.యాదగిరి తెలిపారు. గురువారం కందుకూరులో మండల శాఖ అధ్యక్షుడు మల్లెపల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. జులై 7న నిర్వహించనున్న ఆవిర్భావ వేడుకల్లో గ్రామాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొనేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ, యువజన సంఘం మండలశాఖ అధ్యక్షుడు గానుగపేట జంగయ్య, మండల నాయకులు కె.కృష్ణమాదిగ, నాని, కె.చెన్నయ్య, కె.ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టీచర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

యాలాల, జూన్ 26(ఆంధ్రజ్యోతి):యాలాలలోని జెడ్పీ పాఠశాల సైన్స్ టీచర్ ఖాసింబీపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని మైనార్టీ, దళితప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు టీచర్ ఇంటికి వెళ్లి మాట్లాడారు. పాఠ్యాంశంలో బోధనలో భాగంగా ప్రాక్టికల్ కింద విద్యార్థులకు గొర్రె మెదడును చూపితే సస్పెండ్ చేయటం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఆమె విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధన ప్రకారమే పాఠ్యాంశాన్ని ఖాసింబీ బోధించారని అన్నారు. అలా బోధిస్తేనే కదా విద్యార్థులకు బాగా అర్థం అయ్యేదని అన్నారు. డీఈవో సస్పెన్షన్‌ను ఎత్తివేయాలన్నారు. ఎంఈవో రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, సీబీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, వివిధ సంఘాల నాయకులు గుమ్మడి రత్నం, పి.శ్రీనివాస్, వాజిద్, పి.జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులు వాడాలి


వైద్యశిబిరంలో ఆయుర్వేద వైద్యురాలు ఇందిర, గ్రామస్తులు

యాచారం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులు వాడి దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకోవచ్చని నక్కిసింగారం ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ ఇందిర సూచించారు. గురువారం నందివనపర్తిలో ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వాతం, కీళ్లనొప్పులు, అజీర్ణం, చర్మవ్యాధులకు ఆయుర్వేద మందులు బాగా పనిచేస్తాయన్నారు. స్త్రీ సంబంధిత వ్యాధుల నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యదర్శి శ్రీనివాస్, ఎస్పీఐ అధికారి మల్లికార్జున్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట వసూళ్లు

● ఎక్మాయిలో కాంగ్రెస్ నాయకుల చేతివాటంపై విమర్శలు

బషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎక్మాయిలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట అధికార పార్టీ నాయకులు కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ పక్క ఎమ్మెల్యే ఇళ్ల విషయంలో ఎవరైనా డబ్బుల వసూళ్లుచేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తున్నా కింది స్థాయిల నాయకులకు లెక్క చేయడం లేదు. గ్రామానికి 26 ఇళ్లు మంజూరయ్యాయి. ప్రొసీడింగ్‌లు తెచ్చిన నాయకులు కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ఇంటికి రూ.3వేల నుంచి 5వేల వరకు వసూళ్లు చేశారని చెబుతున్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపికను చేపట్టారు. అయితే కమిటీ సభ్యులు, నాయకులు తమ వారికే ఇళ్లు ఇప్పించారని చర్చించుకుంటున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో కొందరు నాయకులను మందలించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని వసూళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అంచెలంచెలుగా నెరవేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా శంషాబాద్ మండల రైతులకు పెట్టుబడి సాయం డబ్బులు జమవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. గురువారం శంషాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్, డీసీసీ నాయకురాలు మైలారం సులోచనలు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కొత్వాల్‌గూడ మిట్టు, బి.కిష్టయ్య, అక్రమ్, శ్రీధర్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కిష్టమ్మగుడితండా పాఠశాలలో కష్టాలు

● ఆరు బయటే వంటకాలు ● వర్షం వస్తే అంతే సంగతులు


ఆరుబయటే వంటలు చేస్తున్న నిర్వాహకులు

పరిగి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ పరిధిలోని కిష్టమ్మగుడి తండా పాఠశాలలో వసతులు కరువయ్యాయి. మధ్యాహ్న భోజనం వంట కోసం కిచెన్ లేదు. వంట చేసే ఏజెన్సీ నిర్వాహకులు ఆరుబయటే వంట చేస్తున్నారు. వర్షం కురిస్తే ఆ రోజు విద్యార్థులకు భోజనం అంతే సంగతులని తండా వాసులు చెబుతున్నారు. పాఠశాలలో 75మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపోను గదులు కూడా లేవు. ఆరుబయల భోజనం చేస్తున్నారు. అధికారులు వంటగదిని నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు.


పాఠశాల ప్రాంగణంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్ ఏడీఏగా రమాదేవి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలిగా రమాదేవి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఏడీఏగా పనిచేసిన రాజారత్నం పదోన్నతిపై వెళ్లారు. ఇన్నాళ్లు ఏఓ నిశాంత్‌కుమార్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. రమాదేవికి ఉద్యోగులు స్వాగతం పలికి సన్మానించారు.


బాధ్యతలు తీసుకున్న రమాదేవిని సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలి


కస్తూర్బా విద్యాలయంలో బాలికలతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హర్షిత్ చౌదరి

తాండూరు రూరల్, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు నాణ్యమైన భోజనంతోపాటు మంచి విద్యనందించేందుకు పాఠశాల నిర్వాహకులు చర్యలుచేపట్టాలని వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ హర్షిత్ చౌదరి ఆదేశించారు. గురువారం ఐనెల్లిలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయ పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో 400 మంది విద్యార్థినులు ఉన్నారని ప్రిన్సిపాల్ ఆశాలత తెలిపారు. గురువారం 300మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. విద్యాలయంలో సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. బాలికలకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని సూచించారు. అనంతరం సమీపంలోని గుంతబాస్పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఆయనవెంట తహసీల్దార్ తారాసింగ్,ఆర్ఐ గోపి, రెవెన్యూ సిబ్బంది, టీచర్లు ఉన్నారు.

1.04లక్షల మొక్కలు నాటుతాం

ఆమనగల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమంలో ఈ ఏడాది మండలంలో 1.04లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు ప్రత్యేకాధికారి శోభారాణి తెలిపారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని కోరారు. ఆమనగల్లు మండల పరిషత్‌లో గురువారం వన మహోత్సవం, వ్యాధుల నివారణకు చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవో కుసుమమాధురి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. శోభారాణి మాట్లాడుతూ.. నాటేందుకు సిద్ధం చేసినమొక్కలు, స్థలాల ఎంపికపై చర్చించారు. మండలంలోని 13పంచాయతీల్లో ప్రతీ గ్రామంలో 8వేలకు తగ్గకుండా మొక్కలునాటి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శోభారాణి

సంరక్షించాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉండడంతో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఇప్పటి వరకు బేస్మెంట్ లెవల్ పూర్తయిన 37ఇళ్ల లబ్ధిదారులకు మొదటి బిల్లు ఇచ్చామన్నారు. సమావేవంలో ఎంపీవో వినోద, మెడికల్ ఆఫీసర్ మంజుల, ఏవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేశంపేట మండల ప్రత్యేకాధికారి గోపీకృష్ణ

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కేశంపేట: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి గోపీకృష్ణ సూచించారు. కేశంపేట మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం వచ్చినందున మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలని సూచించారు. పెద్ద వర్షం పడిన వెంటనే మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, వ్యాధులు ప్రబలకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఆజంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఎంఏవో శిరీష, వైద్యాధికారి డాక్టర్ నిఖిత, ఉపాధి అధికారి అజీజ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

శంషాబాద్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్ అన్నారు. గురువారం శంషాబాద్ బస్‌స్టాండ్ నుంచి ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, ఇది వారి ఆరోగ్యానికి, కుటుంబాలకు, దేశానికి ప్రమాదకరమన్నారు. ప్రభుత్వం తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తోందని చెప్పారు. మన దేశానికి వెన్నెముక అయిన యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాకారం చేసుకునేందుకు కృషిచేయాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు కాలేజీలు, ఉన్నత పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైతే జీవితం శూన్యం అన్నారు. యాంటీ డ్రగ్స్ వీక్‌గా ఏడు రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ రావు, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐలు నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, ఎస్సైలు శ్రీధర్, అర్షద్ అలీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టాలని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ నిర్మూలించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్-2 ప్రోగ్రాం ఆఫీసర్ చిన్ని శ్రీనివాస్, ఇంజినీరింగ్ విభాగం డీన్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నాయకులు

ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు

బొంరాస్‌పేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి రోడ్డు నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం బాపల్లితండాలో రూ.2.24కోట్లతో వేసే డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తండా నుంచి పరిగి మండలం బడెంపల్లి వరకు రోడ్డు వేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, మల్లికార్జున్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి,వెంకట్రాములుగౌడ్, మోత్యానాయక్, మహేందర్ పాల్గొన్నారు.

జాతీయ విద్యా శిక్షణకు ఈశ్వర్‌రావు



పరిగి,జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో జాతీయ స్థాయి శిక్షణకు కంకల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రావు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టి) ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి, అభ్యసన విధానాలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో ఆయన ప్రదర్శనతో జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి 20మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా, వారిలో ఈశ్వర్‌రావు ఒకరు. ఈశ్వర్‌రావును ఎంఈవో సాయిరెడ్డి, హెచ్‌ఎంలు పుష్ప, లక్ష్మణ్‌లు అభినందించాచారు.


పోరండ్ల గ్రామ నాయకులతో పాండురంగారెడ్డి

కాంగ్రెస్ బలోపేతానికి గ్రామ, మండల కమిటీలు

మహేశ్వరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు త్వరలో పార్టీ కమిటీలు పూర్తి చేస్తామని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. గురువారం పోరండ్లలో పార్టీ గ్రామశాఖ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. కమిటీలను ఏర్పాటుచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మదన్‌పాల్, వేణుగోపాల్, యాదయ్య, శ్రీనివాస్, బలరామ్, జ్ఞానేశ్వర్‌చారి, మహేందర్, సంజీవరెడ్డి, పాండు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామ శివారులోని ఎగ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ గురువారం ప్రకటనలో కోరారు. వెంకటేశ్వర హేచ రీస్ యాజమాన్యం కార్మికుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కంపెనీ ఎదుట పది రోజులుగా కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. యాజమాన్యం స్పందించి, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా ప్రభాకర్ తెలిపారు.

రోగాల కాలం.. జాగ్రత్తలు అవసరం

జీవాల సంరక్షణపై శ్రద్ధపెట్టాలి

- గొర్రెల్లో మూతి రోగం నివారణకు అప్రమత్తంగా ఉండాలి
- వ్యాధిని గుర్తించిన వెంటనే చికిత్స చేయించాలంటున్న పశువైద్యులు

దుద్యాల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో జీవాలకు సీజనల్ వ్యాధులు విరివిగా వస్తుంటాయి. అందుకే ఇతర కాలాలతో పోలిస్తే వాటి సంరక్షణకు గొర్రెలు, మేకల పెంపకందారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. వర్షాలు కురిసే సమయాల్లో గొర్రెలు, మేకలకు మూతిరోగం వస్తుందని పశువైద్యులు సూచిస్తున్నారు. ఈ మూతి రోగాన్ని నీలి నాలుక వ్యాధి అని కూడా పిలుస్తారు. ఇది వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. గొర్రె భాగాల్లో, ముఖంలో వాపు, పండ్లు ఏర్పడతాయి. దోమ కాటు వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. మందలో ఒక గొర్రెకు వ్యాధి సోకితే మిగతా వాటికీ త్వరగా వ్యాపిస్తుంది. కాబట్టి వ్యాధిసోకిన గొర్రె, లేదా మేకను వెంటనే మంద నుంచి వేరుచేయాలి. వెంటనే చికిత్స చేయించాలి.

వ్యాధి లక్షణాలు

గొర్రెలకు తీవ్ర జ్వరం, ముఖం వాపుతో పాటు, పుండ్లు ఏర్పడతాయి. పెదవులు, ముఖం చిగుళ్లు, నాలుక, ముక్కు చుట్టూ వాస్తుంది. ఆహారం తినేందుకు ఇబ్బంది పడతాయి. నోటి నుంచి దుర్వాసన వస్తుంది. వ్యాధి ముదిరితే నాలుక నీలి రంగులోకి మారుతుంది. ముక్కు నుంచి చీము, రక్త స్రావం అవుతుంది. జిగురు ఎండి ముక్కులో ఇరుక్కొని శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడి నీరసించి చివరికి చనిపోయే ప్రమాదం ఉంటుంది.



నివారణ చర్యలు

మూతి రోగం దోమ కాటు వ్యాప్తి చెందుతుంది. వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. నీటి తొట్ల వద్ద జింక్ సల్ఫేడ్ లేదా పొటాషియం పర్మాంగనేట్ ద్రావణాన్ని ఉంచితే అంటువ్యాధిని నియంత్రించొచ్చు. జూన్ చివరి వారం, జూలై, ఆగస్టు నెలల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. పెంపకందారులు వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించి పశువైద్యులతో చికిత్స అందించాలి. గొర్ల మందను సాయంత్రం షెడ్డు/కొట్టానికి చేర్చిన తర్వాత మంద చుట్టూ వేపాకు కాల్చి పొగవేయాలి. పొగకు దోమలు అక్కడి నుంచి వెళ్లిపోతాయి. ఇక వేళ వ్యాధి సోకితే వెంటనే చికిత్స చేయించాలి.

పశువైద్యశాలల్లో మందుల కొరత

వ్యాధి సోకిన జీవాలకు టీకాలు వేయిద్దామంటే అందుబాటులో లేవని గొర్రెల పెంపకందారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పశు వైద్యులను అడిగితే ఆగస్టులో వస్తాయని చెబుతున్నారని తెలిపారు. మెడికల్ షాపుల్లో కొందామంటే భారీ ధరలు ఉన్నాయని చెబుతున్నారు. పశువైద్యాధికారులు స్పందించి వైద్యశాలల్లో టీకాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారుల స్పందన కోరగా.. టీకాల కొరత ఉందని, జూలై, ఆగస్టుల్లో వస్తాయని చెప్పారు.

రఘువీరారెడ్డికి పదవివ్వాలి

- అనుచరుల నినాదాలు
- కాంగ్రెస్ సమావేశంలో గందరగోళం
- మీటింగ్ నుంచి వెళ్లిపోయిన పీసీసీ పరిశీలకులు

ధారూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సముచిత పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పీసీసీ పరిశీలకుల ముందు ఆయన అనుచరులు హల్‌చల్ చేశారు. ధారూరులోని శుభం ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా, మండల, గ్రామ కమిటీల నియామకానికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పీసీసీ పరిశీలకులుగా అశోక్, రాంశెట్టి నరేందర్, వికారాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, మండల నాయకులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలోనే పి.రఘువీరారెడ్డి అనుచరులు లేచి నినాదాలు చేశారు. రఘువీరారెడ్డికి పదవి లేకుండా తమకు పదవులొద్దని, ఆయనకు పదవిస్తేనే తామూ తీసుకుంటామని నినాదాలు చేశారు. రఘువీరారెడ్డి జిందాబాద్ అని నినదించారు. 23ఏళ్లుగా పార్టీకి పనిచేస్తున్న రఘువీరారెడ్డికి తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదని అనుచరులు మండిపడ్డారు. దీంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. అనంతరం వారు ఫంక్షన్ హాల్ నుంచి బయటకొచ్చి రోడ్డుపై బైఠాయించారు. సమావేశం నిర్వహణకు పరిస్థితులు అనుకూలంగా లేవని వాయిదా వేద్దామని పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ పరిశీలకులతో అన్నారు. దీంతో పరిశీలకులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో గొడవ, ఘర్షణలు జరగలేదని, రఘువీరారెడ్డికి ప్రాధాన్యం ఇవ్వాలనే కార్యకర్తలు సమావేశాన్ని బహిష్కరించారని మాన్‌సింగ్ చెప్పారు. సమావేశాన్ని తర్వాత నిర్వహించుకుందామని తెలపటంతో పరిశీలకులు వెళ్లిపోయారని ఆయన వివరించారు.


రోడ్డుపై బైఠాయించిన నాయకులు

హోటళ్లలో విస్తృత తనిఖీలు


నిల్వ పదార్థాలను పరిశీలిస్తున్న మునిసిపల్ సిబ్బంది

తాండూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తాండూరులోని పలు హోటళ్లను మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. శానిటేషన్ విభాగ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. కుళ్లిన కూరగాయలు, ఎక్కువ కాలం నిల్వ చేసిన పదార్థాలును గుర్తించారు. హైదరాబాద్ రోడ్డులో, పాత కూరగాయల మార్కెట్, ఇందిరా చౌక్ తదితర ప్రాంతాల్లోని హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. పాడైన, నిల్వ ఉంచిన పదార్థాలను పారబోశారు. పలు లిక్విడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. నాసిరకం ఆహార పదార్థాలపై హోటళ్ల నిర్వాహకులను ప్రశ్నించారు. హోటల్ కిచెన్, పదార్థాల నిల్వ, పారిశుధ్య, డైనింగ్ నిర్వహణపై పరిశీలించారు. హోటళ్లలో పరిశుభ్ర ఆహారాన్నే విక్రయించాలని, డైనింగ్, ఆవరణను శుభ్రంగా ఉంచాలని. ఇలాంటి పొరపాట్లు మరోసారి చేస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. దాడుల్లో శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఉమేష్, జవాన్లు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

కొడంగల్/దౌల్తాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని తిరుమలాపూర్, నాగసార్, తిమ్మారెడ్డిపల్లి, గుండెపల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం కొడంగల్‌లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 7వ తరగతి వరకు చదవిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం కొడంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉందని, బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు వేయాలని అధికారిని కోరారు.


ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల కొరకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ కోరారు. గురువారం షాద్‌నగర్ అసిస్టెంట్ డిపో మేనేజర్ సుధాకర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. పూడూర్ మండలం కడుమూరుకు గతంలో నడిసిన బస్సులను బంద్ చేయడంతో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. కడుమూరుకు బస్సును నడిపిస్తే కడుమూరు, తిరుమలాపూర్, మిట్టకంకల్, తిమ్మారెడ్డిగూడెం, ఎర్రవల్లి, తాళ్లపల్లి, దోస్వాడ విద్యార్థులు షాద్‌నగర్‌కు వచ్చి చదువుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 9 ఎక్సైజ్ స్టేషన్లు

- రేపు ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా 14 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ నెల 28న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వాటిని లాంఛనంగా ప్రారంభిస్తారని ఎక్సైజ్ అధికారులు గురువారం తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొత్తగా పెద్ద అంబర్‌పేట్, కూకట్‌పల్లి, కొంపల్లి, నాచారం, అల్వాల్, గండిపేట్, కొండాపూర్, మీర్‌పేట్, కాప్రాలలో ఎక్సైజ్ స్టేషన్‌లు ఏర్పాటవుతాయి.


మేడిపల్లిలో ర్యాలీలో ఫార్మాసిటీ నిర్వాసితులు

భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

యాచారం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు మాట ఇచ్చినట్టుగా ఫార్మాసిటీ కోసం నిషేధిత జాబితాలో పెట్టిన పట్టా భూములను రైతుల పేరిట ఆన్‌లైన్ నమోదు చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నిరంజన్, కవుల సరస్వతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మేడిపల్లిలో రైతులతో సమావేశమయ్యారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పట్టాభూములను రైతుల పేరిట ఆన్‌లైన్ చేస్తామని కాంగ్రెస్ మాటిచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేయడం భావ్యం కాదన్నారు. కోర్టు ఉత్తర్వును కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. న్యాయం కోసం జూలై 7న కుర్మిద్ద నుంచి మేడిపల్లి వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే కలెక్టర్, ఆర్‌డీవోల కార్యాలయాలను ముట్టడిస్తామని వెల్లడించారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి


తరగతి గదులను ప్రారంభిస్తున్న రౌండ్‌టేబుల్ సభ్యులు

శంకర్‌పల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శంకర్‌పల్లి ఎంఈవో అక్బర్ అన్నారు. శంకర్‌పల్లి బాలికల పాఠశాలలో గురువారం రౌండ్ టేబుల్-134 వారు నిర్మించిన ఆరు క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. రౌండ్ టేబుల్-134 వారు శంకర్‌పల్లి బాలికల పాఠశాలలో ఆరు తరగతి గదులు, కస్తూర్బా విద్యాలయంలో ఆరు తరగతి గదులు నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం ఉంటే మరింత వృద్ధి సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేదశ్రీ, మహాలింగాపురం, నరహరి, జీవనజ్యోతి, రౌండ్ టేబుల్ 134 సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాతండా వాసి రాజునాయక్‌కు డాక్టరేట్

చౌదరిగూడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం నంద్యాతండాకు చెందిన రాజునాయక్ పిహెచ్‌డీ పట్టా పొందారు. ప్రొఫెసర్ బ్రహ్మానందం చేతుల మీదుగా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో 2018లో పొలిటికల్ సైన్స్ విభాగంలో సీటు సాధించాడు. 'ట్రైబల్ డెవలప్మెంట్- ఎ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్' అనే అంశంపై రీసెర్చ్ చేసి ఉత్తీర్ణత పొందాడు. గురువారం ప్రొఫెసర్ బ్రహ్మానందం నుంచి రాజు పీహెచ్‌డీ అందుకున్నారు. రాజు నాయక్‌ను గిరిజన నాయకులు, అధ్యాపకులు అభినందించారు.


పరిశోధన గ్రంథాన్ని చూపుతున్న రాజునాయక్

పాడైన ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తారా?

● విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం


పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న రైతులు

దోమ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజిపల్లికి చెందిన రైతులు అంజయ్య, వెంకటయ్యకు పరిగి విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతుల పేరుతో పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇచ్చారని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పొలానికి తీసుకెళ్లి ఏర్పాటు చేయగా పని చేయలేదని తెలిపారు. తిరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిగికి తీసుకెళ్లగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు అందించగా అది కూడా పని చేయకపోవడంతో ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం అధికారులు ఇచ్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విలేకరులకు చూయించారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

● బషీరాబాద్ మండలంలోని నర్సరీల్లో 3.16 లక్షల మొక్కల పెంపకం

● జూలైలో మొక్కల పంపిణీకి శ్రీకారం

● ఈ ఏడాది 1.98లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం


నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

బషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా 36గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో 3.16లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. కాగా ఒక్కొక్క పంచాయతీలోని నర్సరీలో 8,800 వందల మొక్కలు పెంచుతున్నారు. అయితే ఈ ఏడాది మొత్తం 1.98లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. ఈ నర్సరీల్లో వివిధ రకాలకు చెందిన నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల మొక్కలు పెంచుతున్నారు. మొక్కలు నాటేందుకు ఇప్పటికే ఆయా గ్రామాల పరిధిలో గుంతలు తీయిస్తున్నామని ఉపాధిహామీ అధికార సిబ్బంది చెబుతున్నారు. ఈ మొక్కలను నిబంధనల ప్రకారం పంటల సాగుకు అనుకూలంగా లేని భూములు, పొలం గట్లపై మొక్కల పెంపకాన్ని చేపట్టేందుకు ఒక్కో రైతుకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కమ్యూనిటీ, స్కూల్ ప్లాంటేషన్, ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరు వైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌లలో మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు తగు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

వర్షాలు సమృద్ధిగా పడితే మొక్కలు నాటిస్తాం



మండలంలోని నర్సరీల్లో 3.16 లక్షల మొక్కలను పెంచుతున్నాం. ఈసారి అవసరం కంటే ఎక్కువగా మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా పడగానే తీసిన గుంతల్లో మొక్కలను నాటిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలను ఎప్పుడైనా నాటించేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు పండ్ల తోటలు పెంచడానికి ముందుకు వస్తే వారికి ఈజీఎస్ ద్వారా మొక్కల పెంపకానికి ప్రోత్సాహకాలు అందజేస్తారు.

- విజయ్‌కుమార్, ఎంపీడీవో, బషీరాబాద్

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమాల్లో రెవెన్యూ అధికారులు, పోలీస్‌సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూన్ 26


బొంరాస్‌పేట్: మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవ ర్యాలీలో విద్యార్థులు


మోమిన్‌పేట్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకట్, ఎంపీడీవో విజయలక్ష్మి



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఫియా ఖానం


కులకచర్ల కేజీబీవీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


తాండూరు రూరల్: జినుగుర్తి మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి


తాండూరు: ప్రసంగిస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్


పరిగి: ర్యాలీలో సీఐ శ్రీనివాస్


మర్పల్లి: మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


కొడంగల్: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


మూడుచింతలపల్లి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకట్‌రెడ్డి


శామీర్‌పేట్: తుర్కపల్లిలోని పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సాహూ మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

పరిగి,జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రిజర్వేషన్‌ల పితామహుడు ఛత్రపతి సాహూమహారాజ్ 151 జయంతిని గురువారం పరిగిలోని పాలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాహూమహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహనీయుడు సాహుమహారాజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సత్తయ్య, రఘురామ్, రాంచందర్, బాలు, బాలురాజు, మాణిక్యం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్


ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న మాజీ సర్పంచ్

చౌడాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని మాజీ సర్పంచ్ తన వాహనంలో ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని చాకల్‌పల్లి మాజీ సర్పంచ్ శేఖర్ గురువారం మరికల్ ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తికి మూర్ఛరావడం గమనించారు. దీంతో తన వాహనంలో ఆ వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. దీంతో మాజీ సర్పంచ్‌ను స్థానికులు అభినందించారు.

29న సాయిచంద్ విగ్రహావిష్కరణ


పరిగిలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుడు, దివంగతనేత సాయిచంద్ ఆశయాలు తెలంగాణలో చిరస్థాయిగా ఉంటాయని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. ఈనెల 29న అమరచింతలో సాయిచంద్ విగ్రహావిష్కరణకు సంబంధించి బుధవారం పరిగిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్.భాస్కర్, ఎం.అశోక్, రాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు మహర్దశ!

(ఐదో పేజీ తరువాయి)

పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ నిర్మిస్తే ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుందనే విషయమై చర్చించిన తర్వాతనే ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

సగానికి పైగా అద్దె భవనాల్లోనే..

జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, మర్పల్లి, కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, వీటి పరిధిలో 1,129 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో 56,766 మంది ఆరేళ్ల లోపు వయస్సు ఉన్న చిన్నారులు నమోదు కాగా, గర్భిణులు 6,313 మంది, బాలింతలు 5,683 నమోదయ్యారు. జిల్లాలో 497 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 195 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 437 కేంద్రాలు ప్రభుత్వ, ఇతర భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లాకు కొత్తగా 51 అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి. 2024-25లో 13 భవనాలు మంజూరు కాగా, 2025-26లో 38 భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ భవనాలు నిర్మించేందుకు అవసరమైన నిధులను విడుదల చేసింది. ఒక్కో భవనానికి రూ.12 లక్షల వంతున 51 భవనాలు నిర్మించేందుకు రూ.6.12 కోట్లు విడుదల చేశారు ఒక్కో భవనం నిర్మించేందుకు మంజూరు చేసిన రూ.12 లక్షల్లో రూ.8 లక్షలు ఈజీఎస్ నిధులు కాగా, 15వ ఆర్థిక సంఘం, మహిళా శిశు సంక్షేమ శాఖల నుంచి రూ. 2 లక్షల చొప్పున విడుదల చేశారు.

మెరుగైన సేవలు అందించేలా...

అంగన్‌వాడీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. చిన్నారులకు ఆటపాటలతో అక్షర జ్ఞానం నేర్పించడమే కాకుండా వారికి పౌష్టికాహారం అందజేస్తున్నారు. అంతే కాకుండా వారి ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి ఆరోగ్య పరమైన సూచనలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి వారికి మరింత మెరుగైన సేవలు అందించే దిశ గా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

అక్రమంగా ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్


నిరసన వ్యక్తం చేస్తున్న ఆయా సంఘాల నాయకులు

పరిగి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, కేవీపీఎస్ నాయకులు రాంచంద్రయ్యలు ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ ఆనంద్‌రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పరిగిలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంగంపల్లి గ్రామంలో సర్వేనంబరు 146లో 4.17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఎకరా భూమి అక్రమంగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అదే గ్రామంలోని 256 సర్వేనంబరులో 20.23 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి ఉందని, ఈ భూమిలో కొందరు వ్యక్తులు 15నెలలుగా పొజిషన్‌లోకి వెళ్లి గుట్టలను చదును చూస్తుంటే, తహసీల్దార్ వారికి వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సత్తయ్య, రఘురాం, రాజేందర్,రమేశ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రికార్డుల్లో తప్పుడు పద్ధతుల్లో పేరు నమోదు చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు వెంకటేశ్, బి.మల్లేశ్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మిట్టకోడూరు గ్రామంలో సర్వేనంబరు 25/1 ప్రభుత్వ సీలింగ్ భూమిలో మాదారం వెంకటయ్య అక్రమంగా పేరు నమోదు చేయించుకున్నాడని, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాంచంద్రయ్య, యాదయ్య, చంద్రయ్య, జంగయ్య, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మందులతో ఎయిడ్స్ నివారణ సాధ్యం

కులకచర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మందులతో ఎయిడ్స్ నివారణ సాధ్యమని వైద్యాధికారిణి మాధురి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. వైఆర్జీ, కేర్ సంస్థల ఆధ్వర్యంలో అనుమానం ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

యాలాల, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి, ఎంపీవో యాదయ్య, పంచాయతీ కార్యదర్శి తదితరులతో కలిసి యాలాల ఎంపీడీవో పుష్పలీల ప్రారంభించారు.

సంక్షిప్తంగా..

సొంతింటి కల సాకారం

పరిగి: నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంద్‌మదిరాజ్, పరిగి పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణలు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలుకాలనీల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, పట్టణ కాంగ్రెస్ నాయకులు పి.చిన్ననర్సింహులు, జగన్, రామకృష్ణారెడ్డి శ్రీనివాస్, ఏజాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించిన ఉపాధ్యాయులు

చౌడాపూర్: చాకల్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న మైబయ్య తన ఇద్దరు పిల్లలను తాను పనిచేస్తున్న పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మరికల్ గ్రామానికి చెందిన రేష్మాబేగం తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంచందర్ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ రాఘవేందర్, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనార్టీ ఉద్యోగులపై వివక్ష తగదు

పరిగి: జిల్లాలో మైనార్టీ ఉద్యోగులపై వివక్ష తగదని మైనార్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సర్దార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కొంతకాలంగా మైనార్టీల పట్ల వివక్ష చూపుతున్నారని తెలిపారు. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సంఘటనల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

బోనాల జాతరకు ఏర్పాట్లు చేయాలి

మూడుచింతలపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ఉద్దెమర్రిలో వచ్చే నెల 13న నిర్వహించే బోనాల జాతరకు ఏర్పాట్లు చేయాలని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ శ్రీపాదరమేశ్వర్‌కు నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని వీధిదీపాలు, రోడ్లు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, నాయకులు లక్ష్మారెడ్డి, వెంకటేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

చౌడాపూర్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామ్మోహన్‌శర్మ, నరసింహరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలు స్వపరిపాలన దిశగా కొనసాగాలి

మోమిన్‌పేట్: గ్రామాల్లో స్వపరిపాలన దిశగా కొనసాగాలని మండల ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తొమ్మిది థీమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రుణం ఇప్పిస్తామని రూ.41వేలు కాజేసిన వారిపై కేసు నమోదు

కులకచర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రుణం ఇప్పిస్తామని రూ.41వేలు కాజేసిన ధనసంస్థపై కులకచర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన యెనుముల వెంకటేశ్‌కు సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్‌లో రుణం ఇస్తామని ఉన్న యాప్‌ను క్లిక్‌చేశాడు. అక్కడి నుంచి ఫోన్ వచ్చింది. తాను ధన సంస్థ నుంచి లోన్ ఇచ్చే బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌నని, సర్టిఫికెట్లు సరిగా ఉంటే రూ.లక్షా 50వేలు రుణం ఇస్తామని చెప్పాడు. రుణం మంజూరుకు ఫార్మాలిటీకి డబ్బులు కావాలని ఒకసారి రూ.5వేలు, మరోసారి రూ.20వేలు ఇలా రూ.41వేల 102 వేయించుకున్నాడు. మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో వెంకటేశ్‌కు అనుమానం కలిగింది. మోసపోయానని తెలుసుకొని గురువారం సైబర్ క్రైమ్ పోలీసులకు 1930 ద్వారా ఫిర్యాదు చేశాడు. వారి అనుమతితో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయ నూతన కమిటీ


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వజ్రేశ్‌యాదవ్

మూడుచింతలపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేశవరం గ్రామపరిధిలో ఉన్న శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నికను బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మర్యాల రమేశ్‌ను కమిటీచైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, డీసీసీ జిల్లా హరివర్ధన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజు, ప్రవీణ్, వెంకటేశ్, శంకర్, ఉపేందర్, నాయకులు హన్మంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

ఘట్‌కేసర్: పేదలకు సీఎం సహాయనిధి వరమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని ఆయన నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పోచారంకు చెందిన బోదాసు స్వరూపతోపాటు పలువురి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి బాబురావు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయాలి


చిట్టిఘనాపూర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకుంటున్న రైతులు

తాండూరు రూరల్, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పకుండా నమోదు చేయించాలని వ్యవసాయాధికారి కొమరయ్య పేర్కొన్నారు. మండలంలోని 33 గ్రామపంచాయతీలు, ఎనిమిది అనుబంధ గ్రామాల్లో 40వేల ఎకరాల్లో సాగు భూమి విస్తరించి ఉందని, ఇందులో 14,200 మంది రైతులు పట్టాదారు పాసుబుక్కులు పొంది ఉన్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా వారికి సేవలందించేందుకు మండల పరిధిలో ఏడు క్లస్టర్లుగా విభజించి 7మంది ఏఈవోలను నియమించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1271మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం

కులకచర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గురువారంరూ.2లక్షల రుణమాఫీ జరిగిన రైతుల పేర్ల జాబితాను పొందుపర్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రభూపాల్, అంబదాస్, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు

దోమ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ఎంపీడీవో గ్యామానాయక్ అన్నారు. బొంపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ముగ్గులు వేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

9న సమ్మెను విజయవంతం చేయాలి


సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఘట్‌కేసర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు యాదయ్య కోరారు. పోచారం మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన మున్సిపల్ కమిషనర్‌కు గురువారం సమ్మె నోటీసును అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీసవేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబిత, దాసు, చంద్రమౌళి, దేవేందర్ పాల్గొన్నారు.

ఘనంగా నవాంద్గీ సొసైటీ వైస్‌చైర్మన్ జన్మదిన వేడుకలు


కరుణఅజయ్‌ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సోదరులు, అభిమానులు

బషీరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నవాంద్గీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు, కార్యకర్తల మధ్య గురువారం ఘనంగా నిర్వహించారు. కొర్విచెడ్ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకలో కరుణఅజయ్‌ప్రసాద్ దంపతులను ఆ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు శాలువా, పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు, ఆర్పీఎల్ సీఈవో బుయ్యాని శ్రీనివాస్‌రెడ్డి, బుయ్యాని సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, మాజీ జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టిగ శ్రీనివాస్‌రెడ్డి, చందర్ నాయక్, అనూప్, మహేందర్‌రెడ్డి, కొప్పూరు నరేష్, వాల్మీకి నరేష్, పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, జానకి, విష్ణువర్ధన్‌రెడ్డి, భీమప్ప, నరేందర్, శ్రీను తదితరులు హాజరయ్యారు.